వైనాట్ 175ని నిజం చేద్దాం


గోరంట్ల: మాట్లాడుతున్న మంత్రి, వైఎస్సార్‌సీపీ పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్


వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- మన జెండా, అజెండా జగనన్నే
- మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ: 'రానున్న ఎన్నికల్లో మన జెండా, అజెండా ముఖ్యమంత్రి వైఎస్ జగనే. అందరూ సమన్వయంతో పనిచేసి వైనాట్ 175 అన్న ముఖ్యమంత్రి నినాదాన్ని నిజం చేద్దాం' అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖామంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. గోరంట్ల మండలం పాలసముద్రం గ్రేట్‌వే విల్లాస్‌లోని మంత్రి స్వగృహంలో బుధవారం ఆమె పెనుకొండ పట్టణ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ముఖ్యమంత్రి అనేక నియోజకవర్గాల్లో మార్పులు చేర్పులు చేస్తున్నారని తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు పెనుకొండ నియోజకవర్గానికి సమన్వయకర్తగా వచ్చినట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ తన విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. పార్టీ శ్రేణులు అందరూ సమానమేనని, ఎలాంటి వర్గాలకూ తావులేదన్నారు. ఎవరికి ఎలాంటి సమస్య ఉన్న తాను అందుబాటులోనే ఉంటానన్నారు. గతంలో జరిగిన విషయాలను ఎవరూ మనసులో ఉంచుకోవద్దన్నారు. ఎవరూ ఎలాంటి అభద్రతా భావంతో ఉండాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే తన లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ తన సోదరుడని, ఆయన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటించి ప్రతి కార్యకర్త, నాయకున్ని నేరుగా కలువనున్నట్లు చెప్పారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా గత ఎన్నికల్లో పని చేసిన దానికంటే మరింత స్ఫూర్తితో విజయానికి బాటలు వేయాలన్నారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ఆ సమస్య పరిష్కరించడానికి చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు నేమతుల్లా, ముహీబా, వెంకటరామిరెడ్డి నాయకులు యాసిన్, ఫరీద్, గణేష్, శంకరరెడ్డి, నాయుడు, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

కష్టపడేవారికి ప్రాధాన్యం

గోరంట్ల: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. స్థానిక రంగమహల్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ మండలస్థాయి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ పెనుకొండ కోటపై మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేయడానికి కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అన్ని విధాలా కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగనేనని కొనియాడారు. బీసీల పార్టీ అని చెప్పుకునే టీడీపీ వారి ఉన్నతికి చేసింది శూన్యమన్నారు. కేవలం బీసీలను చంద్రబాబు రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాలతో రాష్ట్రం దివాళా తీస్తుందని చెప్పిన బాబు... ఇప్పుడు టీడీపీ మ్యానిఫెస్టోలో సంక్షేమ పథకాలను ఎలా ప్రకటించారో చెప్పాలన్నారు. ప్రభుత్వ పథకాల పేరు మార్చడంతో పాటు ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న పథకాలను కాపీకొట్టి మ్యానిఫెస్టులో పెడుతున్నారని ఎద్దేవా చేశారు. అంతకు ముందు గుమ్మయ్య గారిపల్లి క్రాస్‌లో మంత్రి ఉషశ్రీచరణ్ మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, టౌన్ కన్వీనర్ ధనుంజయరెడ్డి, ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ సభ్యులు పాలేజయరాంనాయక్, మంత్రి భార్త చరణ్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫకృద్దీన్, గోరంట్ల మార్కెట్ యార్డు చైర్మన్ బూదిలి వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఆర్.వెంకటరెడ్డి, మండల ఉపాధ్యక్షులు నాగభూషణరెడ్డి, రామలక్ష్మమ్మ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పోతులరామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్‌సీపీదే


మడకశిరలో శాంతమ్మకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- పార్టీ శ్రేణులు ఆ దిశగా పనిచేయాలి
- వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ

మడకశిర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ తెలిపారు. ఆమె బుధవారం తొలిసారి ఆమె మడకశిరకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శాంతమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తనపై ఎంతో నమ్మకం ఉంచి హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్తగా నియమించారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు తనకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని కోరారు. పార్టీ గెలుపే ధ్యేయంగా పెట్టుకుని కష్టపడి పని చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పార్టీని గెలిపిస్తాయన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు వైఎస్ జగన్ పెద్దపీట వేశారని తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని మంచి పనులను వైఎస్ జగన్ చేశారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఆమె పట్టణంలోని వాల్మీకి సంఘం నాయకులను కూడా కలిసి తనకు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా బోయ సంఘం నాయకులు ఆమెను సన్మానించారు. ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, కౌన్సిలర్లు నాగేంద్ర, రమేష్, సుభద్ర, నాయకులు మంజునాథ్, నాగభూషణ్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, సతీష్, అంజలి, ఫకృద్దీన్, దొడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిస్తాం

- సబ్ కలెక్టర్ అపూర్వ భరత్


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

మడకశిర: ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. ఆయన బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ అంశాలపై చర్చించడానికి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఓటరు జాబితా తయారీ, ఎన్నికలకు సన్నద్ధత తదితర విషయాలపై వివిధ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఓటరు జాబితా తయారీలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హులైన వారినే ఓటరు జాబితాలో చేరుస్తున్నట్లు వివరించారు. అనర్హులను జాబితా నుంచి తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు జాబితాలపై అభ్యంతరాలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్నికల నేపథ్యంలో అధికారులు పారదర్శకంగా పనిచేయాలని కోరారు. తప్పు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వివిధ పార్టీల ప్రతినిధులకు ఈవీఎంల వినియోగంపై డెమో నిర్వహించారు. సమావేశంలో పలువురు తహసీల్దార్లు, వివిధ పార్టీ నాయకులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

హిందూపురం: జిల్లా బ్రాహ్మణ సేవా సంఘ సమైక్య ఆధ్వర్యంలో స్థానిక నానెప్ప నగర్ గాయత్రీ భవనంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు, సంస్కృతిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీ ప్రసాద్ రావు, కోటిపి నాగేశ్వరరావులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మురళీదేశాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ రామమూర్తి, మారుతీరావు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి


ఉపాధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న ఏపీడీ లక్ష్మీనారాయణ

రొద్దం: మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాయల సమావేశపు భవనంలో బుధవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఏపీడీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి పనుల పరోగతి, కూలీల సంఖ్య, పనుల ప్రణాళికలపై సమావేశంలో చర్చించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో కూలీల సంఖ్య పెంచడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. గుర్తించిన పనులను నాణ్యతగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రషీద్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అస్టెంట్లు, సీఓ తదితరులు పాల్గొన్నారు.

ధనాపురం హైస్కూల్‌లో చోరీ

పరిగి:మండలంలోని ధనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పాఠశాలలోని హెచ్‌ఎం కార్యాలయంతో పాటూ వివిధ గదుల తాళాలను పగల గొట్టారు. మూడు క్వింటాళ్ల బియ్యపు బస్తాలతో పాటు పాత ఇనుప వాకిళ్లను తస్కరించారు. ఈ మేరకు హెచ్‌ఎం జ్యోతిర్మయి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్ పరిశీలించింది.

అపస్మారకస్థితిలో వృద్ధుడు

అగళి: మండల పరిధిలోని కోడిపల్లి గ్రామ చెరువు సమీపంలో ఓ పొలంలో మూడు రోజుల నుంచి అపస్మారక్షితిలో పడి ఉన్న ఓ వృద్ధుడిని స్థానికులు బుధవారం గుర్తించారు. వెంటనే వారు 108కు సమాచారం అందించారు. అనాథగా పడి ఉన్న వృద్ధుడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం స్పృహలోకి వచ్చిన వృద్ధుడు తనది గొల్లపల్లి అని చెప్పినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.


మడకశిర మండలం కల్లుమర్రిలో వాలీబాల్ మ్యాచ్ ఆడుతున్న క్రీడాకారులు


మడకశిరలో కబడ్డీ ఆడుతున్న యువకులు

ఉల్లాసంగా 'ఆడుదాం ఆంధ్రా'

పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో పలు మండల కేంద్రాల్లో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జరిగాయి. మండలస్థాయి పోటీలను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పర్యవేక్షించారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. – సాక్షిబృందం


అమరాపురంలో కబడ్డీ ఆడుతున్న మహిళలు



రొద్దం: మండలస్థాయి పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు


అగళిలో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారిణులు


రొళ్ల: క్రికెట్ పోటీల్లో భాగంగా టాస్ వేస్తున్న ఎంపీడీఓ ఆజాద్

క్లుప్తంగా

పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి


రొళ్ల: బీజీ హళ్లిలో పింఛన్ అందిస్తున్న దృశ్యం

రొళ్ల: వైఎస్సార్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీని గురువారం సాయంత్రంలోపు వలంటీర్లు పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు. జనవరి నెలకంటే ముందు, జనవరిలో 68 కొత్తగా మంజూరైన వాటితో కలిపి మొత్తం 5,781 మందికి గాను రూ.1,72,49,000 కోట్లు రొళ్ల మండలానికి పింఛన్ నగదు మంజూరైందన్నారు. ఇందులో బుధవారం సాయంత్రానికి 5,371 మందికి గాను రూ.1,60,29,000 పింఛన్ మంజూరైందన్నారు. ఇందులో 92.91 శాతం లబ్ధిదారులకు ఇప్పటికే పంపిణీ చేయడం జరిగిందన్నారు. మిగిలిన వారికి కూడా వెంటనే పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

మడకశిర: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయానికి చెందిన హుండీ కానుకలను బుధవారం ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో లెక్కించారు. మండల కాలంలో హుండీ కానుకల ద్వారా ఆదాయం రూ.91,600 వచ్చినట్లు సభ్యులు తెలిపారు. హుండీ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తున్న భక్తులకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన పింఛన్ల పంపిణీ

పరిగి: మండలంలో ఇటీవల కొత్తగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుక నగదును లబ్ధిదారులకు పలు గ్రామాలలో అందించారు. ఇటీవల ప్రభుత్వం 167 కొత్త పింఛన్లను మంజూరు చేసింది. శ్రీరంగరాజుపల్లిలో సర్పంచ్ మల్లక్క, వైస్ ఎంపీపీ వేదవతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పింఛన్ అందించారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

పరిగి: మండలంలోని ఊటుకూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా జరిగింది. ఉపాధ్యాయుడు హనుమంతరాయుడు అధ్యక్షతన 1989–90 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ గురువులు వేణుగోపాల్ గుప్తా, ఫణికుమార్, ఫక్కీరప్ప, బాలకృష్ణా, కుల్లారెడ్డి, రంగప్ప, ఏలియా తదితరులను ఘనంగా సన్మానించారు.

కేబుల్ అపహరణ

మడకశిరరూరల్: మండలంలో మంగళవారం రాత్రి దొంగలు కదిరేపల్లిలో వాటర్ స్కీమ్ కేబుల్‌ను అపహరించారు. మెళవాయిలోనూ మేకల అపహరణకు ప్రయత్నించారు. కదిరేపల్లి గ్రామ సచివాలయం వద్ద ఉన్న వాటర్ స్కీమ్ బోరు కేబుల్‌ను దొంగలు ఎత్తుకెళ్లారని సర్పంచ్ నర్సేగౌడు తెలిపారు. 25 రోజుల క్రితం కూడా ఈ బోరు వైరును అపహరించారన్నారు. మరోవైపు మండలంలోని మెళవాయి ఎస్సీకాలనీలో కావలి నాగమ్మ ఇంటి వద్ద కట్టేసిన మేకలను మంగళవారం అర్ధరాత్రి సమయంలో దొంగలు అపహరణకు ప్రయత్నం చేశారు. ఆ సమయంలో మేకలు బెదరడంతో చుట్టుపక్కల జనం కేకలు వేయడంతో ఇద్దరు దొంగలు పరారయ్యారు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా ఎస్‌ఐ లోకేష్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆయన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట


ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పెద్ద పీట వేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని 13, 20వ వార్డులోని ఇందిరానగర్, బోయపేటలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, కౌన్సిలర్లు సునీత, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు బహుమతులు

పెనుకొండ: కొన్ని నెలలుగా ఆర్టీసీ బస్సుల్లో జీఆర్‌టీ-6, పీవీజీ-5 బస్సుల్లో ప్రయాణించిన వారికి బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో లక్కీ డ్రా నిర్వహించారు. ఇందులో భాగంగానే షంషాద్ అనే ప్రయాణికురాలు మొదటి బహుమతి గెలుచుకుంది. ఆమెతో పాటు మరో ముగ్గురికి లక్కీ డిప్ ద్వారా బహుమతులను ప్రదానం చేశారు.డిపో మేనేజర్ రామసుబ్బయ్య, టీఐ-2 రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఘన సన్మానం

లేపాక్షి: 11 కేవీ లైన్‌ను మార్పుచేయడంతో లేపాక్షి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం ఘనంగా సన్మానించారు. 200 కుటుంబాల ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న 11కేవీ విద్యుత్ తీగలు తొలగించాలని ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్తులు తెలిపారు. రూ.15 లక్షలతో పనులు పూర్తి చేసేలా వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి కృషి చేశారన్నారు.

నేడు మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

లేపాక్షి: పల్లెబాట కార్యక్రమంలో భాగంగా గురువారం రాష్ట్ర భూగర్భ, గనులశాఖ మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి మండలంలో రెండోరోజు పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు కోడిపల్లి ప్రజలతో మమేకమవుతారు. చోళసముద్రంలో 9.30 గంటలకు, బిసలమానేపల్లి 11.30 గంటలకు, కల్లూరులో 2.30 గంటలకు, కొండూరులో 3.30 గంటలకు మంత్రి పర్యటిస్తారు.

నేడు వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం

మడకశిర: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో గురువారం మధ్యాహ్నం 12 గంటలకు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలపై చర్చించి ఆ తర్వాత హిందూపురం పర్యటనలో ఉన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

18న మండల సర్వసభ్య సమావేశం

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 18న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ కవిత, ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడితో పాటు అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ మెంబర్ హాజరు కావాలన్నారు. మండలస్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

గోరంట్లలో మరో చోరీ

గోరంట్ల: స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో కదిరి – హిందూపురం ప్రధాన రహదారిపై ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తికి చెందిన దుకాణంలో మంగళవారం చోరీ జరిగింది. ఈమేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. రాత్రి వేళ షాపునకు ఉన్న షెట్టర్‌ను దొంగలు రాడ్లతో తెరిచి దుకాణంలోని సిగరెట్ బండిళ్లు, క్యాష్, ఇతర వస్తువులను అపహరించుకెళ్లారు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి గుమ్మయ్యగారిపల్లి క్రాస్‌లో బెస్త నారాయణమ్మ షాపులోనూ దొంగతనం జరిగిన విషయం పాఠకులకు తెలిసిందే. వరుస దొంగతనాలతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నేడు మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

రొద్దం: మంత్రి ఉషశ్రీచరణ్ గురువారం రొద్దం మండలంలో పర్యటించనున్నట్లు మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 8 గంటలకు బొక్సంపల్లి క్రాస్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి శ్యాపురంలో పర్యటించనున్నట్లు వివరించారు.

జైనులు విద్యావంతులుగా ఎదగాలి

పావగడ: జైన మతస్తులు తమ పిల్లలను బాగా చదివించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని జైన సమాజ నాయకుడు బ్రహ్మ దేవయ్య తెలిపారు. తాలూకాలోని నిడుగల్ దుర్గం శ్రీకృష్ణ హరణ పార్శ్వనాథ తీర్థంకర జయంతి సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జైన ధర్మం నాయకులు హంబణ్ణ, పి సుందర రాజయ్య, ఆర్ బి జయణ్ణ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్‌లో బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా బాగేపల్లి వైపు నుంచి టాటాఏస్ వాహనంలో కర్ణాటక రెడ్ వైన్ ఉండటాన్ని గుర్తించారు. ఆరు వైన్ బాటిళ్లు, రెండు జిన్ బాటిళ్లు స్వాధీనం చేసుకొని, వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు.

14న కబడ్డీ పోటీలు

సోమందేపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ నెల 14న మండల కేంద్రమైన సోమందేపల్లిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ యూత్ క్లబ్ నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 8328441378 నంబర్లను సంప్రదించాలన్నారు.